ఆదివారం

15-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 456 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



## సీఎం రేవంత్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదు

- దుష్ట సంప్రదాయాలకు తెరతీస్తున్నారు
- దౌర్భాగ్య సీఎంగా చరిత్రలో నిలిచిపోతారు
- రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

ముందడుగు తెలంగాణ:

సీఎం రేవంత్ రెడ్డి దుష్ట సంప్రదాయాలకు తెరతీస్తున్నారన్న, దౌర్భాగ్య సీఎంగా చరిత్రలో నిలిచిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డిని వదిలే ప్రసక్తే లేదన్నారు. 10 ఏళ్ల తెలంగాణలో ఇలాంటి హింసాయుత ఘటనలు ఎప్పుడూ చూడలేదు. మా పదేళ్ల పాలనలో ఎప్పుడూ అలాంటివి లేవు.

మిగతా 2లో

## వారసత్వ పార్టీలు
# తప్పుదోవ పట్టిస్తాయి

- జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు
- దోడా జిల్లాలో పర్యటించిన ప్రధాని మోడీ



ముందడుగు జమ్ముకశ్మీర్:

వారసత్వ రాజకీయాలు తరహా పార్టీలు జమ్మూకశ్మీర్ ప్రాంతంలో అభివృద్ధిని దెబ్బతీశాయని ప్రధాని మోడీ విమర్శించారు. జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆయన పర్యటించారు. అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆరోజులు ముగిశాయని చెప్పారు. అలాగే బిజెపి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

మిగతా 2లో



15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తి

మిగతా 3లో



తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకేజీ

మిగతా 3లో



ప్రధాని మోడీ ఇంటికి దీపజ్యోతి..

మిగతా 4లో



పల్లెటూరి అబ్బాయిని పెళ్లి చేసుకుంటే రూ.3.5 లక్షలు

మిగతా 5లో

## పట్టాలెక్కనున్న అమృత్ వందేభారత్ రైలు

- మొదటగా గుజరాత్‌లో సేవలు ప్రారంభం
- సెప్టెంబర్ 16న ప్రారంభించనున్న మోడీ

ముందడుగు జాతీయం:



దేశంలో అమృత్ భారత్ రైలూ అందుబాటులోకి వచ్చింది. ఇక వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలో పట్టాలెక్కనున్నాయి. ఇప్పుడు వందే మెట్రో రైళ్ల వంతు వచ్చింది. మెట్రో నగరాల మధ్య రైలు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఉద్దేశించిన వందే మెట్రో

మిగతా 2లో

## ఎయిమ్స్ ఆసుపత్రికి
# ఏచూరి భౌతికకాయం

### ర్యాలీలో లాల్‌సలామ్ కామ్రేడ్ నినాదాలు

ముందడుగు జాతీయం:

కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ (ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు యోధుడు సీతారామ్ ఏచూరి భౌతిక కాయాన్ని ఢిల్లీలోని పార్టీ కార్యాలయం నుంచి న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. కమ్యూనిస్టు శ్రేణులు ర్యాలీగా ఆయన భౌతిక కాయాన్ని ఎయిమ్స్‌కు తీసుకెళ్తున్నాయి. ర్యాలీలో 'లాల్‌సలామ్ కామ్రేడ్' నినాదాలు హోరెత్తుతున్నాయి.

మిగతా 2లో



ముందడుగు
ఆదివారం, 15-09-2024, హైదరాబాద్

# ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నా

## చర్చలకు రండి.. విధుల్లో చేరండి.. వైద్యుల శిబిరానికి వెళ్లిన మమతా బెనర్జీ

ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్యురాలి అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈక్రమంలో శనివారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడారు. స్వయంగా ఆమె నిరసన శిబిరానికి వెళ్లి.. వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని కోరారు. ఈ హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమ బెంగాల్ ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం 'స్వస్థ్ భవన్' ఎదుట జూనియర్ వైద్యులు గత నెల రోజులుగా ఆందోళన సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యాహ్నం నిరసన శిబిరానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెళ్లారు. ఆమెను చూడగానే 'న్యాయం కావాలి' అంటూ జూనియర్ వైద్యులు నినాదాలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇదే తన చివరి ప్రయత్నం అని అన్నారు.



ఇక్కడికి నేను ముఖ్యమంత్రిగా రాలేదు. మీ దీదీ (సోదరి)గా వచ్చా. నాకు సీఎం పదవి ముఖ్యం కాదు. కానీ, నేనొక్కదాన్నే ప్రభుత్వాన్ని నడపట్లేదు కదా. బాధితురాలికి న్యాయం జరగాలనే నేనూ కోరుకుంటున్నా" అని మమతా బెనర్జీ అన్నారు. "ఎండా, వానల్లోనూ మీరు రోడ్లపై ఆందోళన చేస్తుంటే నేను ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నా. మీ డిమాండ్లను కచ్చితంగా అధ్యయనం చేస్తాం. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం. ఆర్జీ కర్ ఆసుపత్రిలో రోగుల సంరక్షణ కమిటీని రద్దు చేస్తున్నా. దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని సీబీఐని కోరుతున్నా. నామీద విశ్వాసం ఉంటే.. చర్చలకు రండి. మీరు వెంటనే విధుల్లో చేరండి. మీపై ఎలాంటి చర్యలు తీసుకోబోం" అని మమతా బెనర్జీ కోరారు. అయితే, తమ డిమాండ్లపై చర్చ జరిగేవరకు రాజీకొచ్చే ప్రసక్తే లేదని వైద్యులు తేల్చిచెప్పడంతో సీఎం అక్కడినుంచి వెళ్లిపోయారు.

# వారసత్వ పార్టీలు తప్పుదోవ పట్టిస్తాయి

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన జమ్మూకశ్మీర్‌ను విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరివారవాదులు వంచన చేయడం ప్రారంభించారు. మీరు విశ్వసించిన రాజకీయపార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టించుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టిసారించారు. జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి.

2000 సంవత్సరం నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగలేదన్న సంగతి మీకు తెలిసిందే. కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కొత్తనాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని ప్రయత్నించాను. తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. ఈ ప్రాంతంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవని మీకు తెలుసు. లాల్‌చౌక్ వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ రోజులు ముగిశాయి" అని మోదీ మాట్లాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెల్లడించారు. పలు హామీలను ప్రకటించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రాంతీయవాదాన్ని తెచ్చి, హింసను రేపుతున్నారు. హైదరాబాద్ లా అండ్ ఆర్డర్‌ని కంట్రోల్ చెయ్యలేరు. ముఖ్యమంత్రి 22 సార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. ఒక ఎమ్మెల్యే ఇంటికి గూండాలను పోలీసుల ఎస్కార్ట్ ఇచ్చి పంపారు. ఇంత దౌర్భాగ్య సీఎంని ఎక్కడా చూడలేదు. 100 రోజుల్లో గ్యారెంటీ హామీలను అమలు చేస్తానన్న సన్నాసి ఎక్కడ అని ప్రశ్నిస్తే.. మాపై దాడులకు దిగుతున్నారు" అని కేటీఆర్ అన్నారు. "హైదరాబాద్ ప్రజలు తనకు ఓటు వెయ్యలేదనే రేవంత్ రెడ్డి.. ఇలాంటి చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలంతా మా వాళ్లే. బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రాంతీయ తత్వంపై దాడి చెయ్యలేదు. కౌశిక్ రెడ్డిపై అరికెపూడి గాంధీ నోటికొచ్చినట్లు తిట్టడం ఏం సంస్కృతి. చరిత్రలో పనికిమాలిన ముఖ్యమంత్రులు చాలా మంది వచ్చారు. పెద్ద పెద్ద వారితో తలపడ్డాం. రేవంత్ రెడ్డి బుల్లోడు. ఈ ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదు. గాంధీ ఇప్పటికీ బీఆర్ఎస్‌లో ఉన్నారని చెప్పడం.. కామెడీయే అని కేటీఆర్ అన్నారు.

## ఎయిమ్స్ ఆసుపత్రికి

# ఏచూరి భౌతికకాయం

(మొదటిపేజీ తరువాయి)

సీతారామ్ ఏచూరి కోరిక మేరకు ఆయన కుటుంబసభ్యులు ఏచూరి భౌతిక కాయాన్ని మెడికల్ రిసెర్చ్ కోసం ఎయిమ్స్ ఆస్పత్రికి దానం చేశారు. ఆ మేరకు ఆయన భౌతిక కాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించేందుకు తీసుకెళ్తున్నారు. గత కొన్ని రోజులుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న సీతారామ్ ఏచూరి చికిత్స పొందుతూ ఈ నెల 12న తుదిశ్వాస విడిచారు. దాంతో బంధుమిత్రుల సందర్శనార్థం ఆయన నివాసంలో, కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం ఢిల్లీలోని సీపీఐ (ఎం) పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. ఇవాళ ఆయనకు కోరిక మేరకు ఎయిమ్స్‌కు భౌతిక కాయాన్ని అప్పగిస్తున్నారు.



## పట్టాలెక్కనున్న

# అమృత్ వందేభారత్ రైలు

(మొదటిపేజీ తరువాయి)

సేవలు అందుబాటులోకి రానున్నాయి. దేశంలోనే తొలి వందే మెట్రో సర్వీసును సెప్టెంబర్ 16వ తేదీ సోమవారం ప్రారంభం కానుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ భుజ్ మధ్య ఈ రైలు పరుగులు పెట్టనుంది. ప్రధాని రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా ఆయన ఈ సేవలను ప్రారంభించనున్నారు. వందే మెట్రో అనేది పూర్తి అన్‌రిజర్వ్‌డ్ ఎయిర్ కండీషన్‌తో కూడిన రైలు. ఇందులో 1150 మంది కూర్చుని, 2058 మంది నిల్చుని ప్రయాణం చేయొచ్చని పశ్చిమ రైల్వే (అహ్మదాబాద్) పీఆర్‌ఓ ప్రదీప్ శర్మ తెలిపారు. అహ్మదాబాద్ భుజ్ మధ్య 9 స్టాపుల్లో ఈ రైలు ఆగుతుందని తెలిపారు. 360 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 45 నిమిషాల్లోనే చేరుకుంటుందని చెప్పారు. గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం భుజ్‌లో 5.05 గంటలకు ప్రారంభమై అహ్మదాబాద్ జంక్షన్‌కు 10.50 గంటలకు చేరుకుంటుందని శర్మ తెలిపారు. ప్రయాణికులు కొన్ని నిమిషాల ముందే టికెట్ కొనుక్కుని రైలు ఎక్కొచ్చని పేర్కొన్నారు.

ముందడుగు
ఆదివారం,
15-09-2024,
హైదరాబాద్

# తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకేజీ

- ఎలాంటి నష్టం లేదన్న అధికారులు
- తాజ్‌మహల్ ఆవరణలో ముంచెత్తిన వరద



**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఆగ్రాలోని ప్రముఖ పాలరాతి కట్టడం తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గత మూడు రోజులుగా ఆగ్రాలో భారీగా వర్షాలు కురవడమే ఇందుకు కారణమని తెలిపారు. అయితే ఆ నీటి లీకేజీ వల్ల ఎలాంటి నష్టం లేదని తెలిపారు. తాజ్‌మహల్ ఆవరణలోని తోటను వరద ముంచెత్తింది. గత మూడు రోజులుగా ఆగ్రాలో కురుస్తున్న వర్షాల వల్ల తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకవుతుంది. దీనివల్ల ఎటువంటి నష్టం లేదు' అని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పేర్కొంది. ఇక, ఇదే విషయాన్ని ఆగ్రా సర్కిల్ సూపరింటెండింగ్ చీఫ్ రాజ్‌కుమార్ పటేల్ స్పష్టంచేశారు. డ్రోన్ కెమెరాల సహాయంతో డోమ్ పరిస్థితిని పరిశీలించామన్నారు. సీపేజ్ వ్యవస్థలో లోపం కారణంగా లీక్ సంభవిస్తున్నట్లు వెల్లడించారు. అయితే దీనివల్ల ఎలాంటి నష్టం లేదన్నారు.

20172023 మధ్య కాలంలో అత్యధికమంది విదేశీయులు పర్యటించిన ప్రాంతంగా ఆగ్రా నిలిచిందని రాష్ట్ర పర్యటకశాఖ అధికారిక డేటాలో పేర్కొంది. ఈ డేటా ప్రకారం.. 2017 2023 మధ్య 1.51 కోట్ల మంది విదేశీయులు ఉత్తరప్రదేశ్‌ను సందర్శించగా అందులో 80.08 లక్షల మంది ఆగ్రా, 28 లక్షల మంది వారణాసిలో పర్యటించినట్లు తెలిపారు. మహమ్మారి సమయంలో విదేశీ పర్యటకుల సంఖ్య తగ్గినప్పటికీ.. గత రెండు, మూడు ఏళ్ల నుంచి ఈ సంఖ్య పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.



# 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తి

## కేసు పెట్టారని దళితులను గ్రామం నుంచి వెలివేశారు

**ముందడుగు కర్ణాటక:**

15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన అగ్రవర్ణానికి చెందిన వ్యక్తిపై కేసు పెట్టడంతో గ్రామంలోని దళితులను వెలివేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో వారు బాలికను ప్రశ్నించగా ఓ వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అమానుషానికి పాల్పడ్డాడని, ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడని పేర్కొంది. దీంతో వారు నిందితుడి వద్దకు వెళ్లి ఆమెను వివాహం చేసుకోవాలని కోరారు. అతడు ఆధిపత్యవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో దళిత బాలికను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. ఈ విషయంపై బాధితురాలి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలిక కుటుంబం అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలోని 50 దళిత కుటుంబాలను గ్రామ పెద్దలు వెలేశారని, తమకు ప్రాథమిక సౌకర్యాలు, కిరాణా సామగ్రి, ఆహారం అందకుండా చేస్తున్నారని దళిత సంఘాల సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు గ్రామ పెద్దలను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఆ ఆరోపణలను ఖండించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# కేజ్రీవాల్‌కు టపాసులతో స్వాగతం..

## టపాసులు పేల్చిన కార్యకర్తలపై కేసు ■ బాణసంచా వినియోగంపై ఢిల్లీలో నిషేధం

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నిన్న రాత్రి తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సీఎంకు టపాసులతో స్వాగతం పలికారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాణసంచా వినియోగంపై దిల్లీలో నిషేధం ఉండటమే ఇందుక్కారణం..! తిహాడ్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత దిల్లీ సివిల్ లైన్స్‌లో సీఎం నివాసం వెలుపల ఆప్ కార్యకర్తలు టపాసులు పేల్చారు. దీంతో పాటు దిల్లీలోని పలు ప్రాంతాల్లోనూ కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో భారతీయ న్యాయ సంహిత చట్టం కింద గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. దేశ రాజధాని నగరంలో కాలుష్య నియంత్రణే లక్ష్యంగా బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు గత సోమవారం ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది జనవరి 1 వరకు అమలులో ఉండనుంది. ఆన్‌లైన్‌లో విక్రయాలు, డెలివరీలకూ ఈ నిషేధం వర్తిస్తుందని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు.



ముందడుగు
ఆదివారం, 15-09-2024, హైదరాబాద్

## ప్రధాని మోడీ ఇంటికి దీపజ్యోతి..

### ఘనస్వాగతం పలికిన నరేంద్ర మోడీ



**ముందడుగు ఢిల్లీ:**

మన దేశంలో గోవును గోమాతగా పూజిస్తారు. ఆవులను పూజించడం మనం చూస్తూనే ఉన్నాం. భూమిపై మానవ మనుగడ ఎర్పడినప్పటి నుంచి మనుషులకు అన్ని విధాలుగా ఆవులు సహాయం చేస్తున్నాయి. సింధు నాగరికతలో భారతీయులు మొదటిగా స్నేహం చేసింది కుక్క, గోవు, గుర్రం, కోళ్లతోనే అని చరిత్ర చెబుతోంది. ఇలా గోవులు మన జీవితంలో భాగమైపోయాయి. ప్రధాని నరేంద్ర మోదీకి గోవులంటే చాలా ఇష్టం. తాజాగా ఆయన ఇంటి గోవు ఓ దూడకు జన్మనిచ్చింది. దానికి దీప జ్యోతి అనే పేరు పెట్టారు.

ప్రధాని మోడీ ఇల్లు ఢిల్లీలోని లోక కళ్యాణ మార్గంలో ఉంది. అక్కడ తల్లి ఆవు.. దూడకు జన్మనిచ్చింది. వినాయక నవరాత్రుల సమయంలో ఈ దూడ పుట్టడం గొప్ప విషయంగా చెబుతున్నారు. శనివారం దీప జ్యోతిని ఇంట్లోకి ఆహ్వానించిన మోదీ.. తమ కుటుంబం లోకి కొత్త మెంబర్ వచ్చినట్లు తెలిపారు. ఆవు... అన్ని రకాలుగా ఆనందాన్ని తెస్తుంది. ఈ దూడ తలపై కాంతి ఆకారంలో ఒక మార్క్ ఉంది. అందుకే ఈ దూడకు దీప జ్యోతి అనే పేరు పెట్టినట్లు ప్రధాని మోదీ తెలిపారు. దీప జ్యోతి చాలా అందంగా ఉందనీ, చూడ ముచ్చటగా ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఆ లేగదూడతో ఆయన పూజ చేశారు. దానికి ముద్దు పెట్టారు.

## కాంటినెంటల్ ఆసుపత్రిలో ఓనం వేడుకలు

### వేడుకల్లో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గురున్ రెడ్డి



**ముందడుగు హైదరాబాద్:**



కేరళ సంస్కృతి, సాంప్రదాయాన్ని గౌరవించే ఓనం పండుగను హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో శనివారం అంగరంగవైభవంగా జరిపారు. కాంటినెంటల్ ఆసుపత్రి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి క్యాంపస్‌లో ఈ వేడుకలు నిర్వహించారు. కేరళ సాంస్కృతిక వారసత్వం, ఐక్యత భావాన్ని పెంపొందించే ఉత్సాహభరితంగా ఈ ఉత్సవాలను నిర్వహించారు. సాంప్రదాయ పూకలం (పూల తివాచీ)తో ఆసుపత్రి ఆవరణను అందంగా అలంకరించారు. ఆసుపత్రి కేరళ సిబ్బంది కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేరళ సాంప్రదాయ విందును ప్రతిబింబించే ఓనమ్ సధ్య హాజరైన వ్యక్తులందరికీ అందించారు. ఈ సాంప్రదాయ వేడుకలలో సాంస్కృతిక వైవిధ్యం మరియు సంపూర్ణ శ్రేయస్సు పట్ల కాంటినెంటల్ హాస్పిటల్స్ నిబద్ధతను ప్రదర్శిస్తూ, కేరళ ఉద్యోగులలో ఐక్యత మరియు పండుగ స్ఫూర్తిని నింపారు. ఓనం వేడుకల్లో కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ డాక్టర్ గురు న్ రెడ్డి, కాంటినెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రఘు ఎన్ రెడ్డి, వైద్యులు మరియు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

## బాలికల గురుకులంలో ఘనంగా హిందీ దివాస్ వేడుకలు

**ముందడుగు వరంగల్:**

వరంగల్ హంటర్ రోడ్డులోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ దివాస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సల్ల శైలజ మాట్లాడుతూ హింది నేర్చుకోవడం వలన కలిగే లాభాలు మరియు ప్రపంచ బాషల్లో రెండవ స్థానం పొందిన భాష హిందీ అని కొనియాడారు. హిందీ ఉపాధ్యాయురాలు మాడిశెట్టి సుధ మాట్లాడుతూ హిందీ రాజ్యభాష అని పేర్కొన్నారు. హిందీని రాజభాషగా గుర్తించారని, మనమందరం ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు హిందీ భాషపై వ్యాసరచన, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ శైలజ, హిందీ ఉపాధ్యాయురాలు మాడిశెట్టి సుధను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పి.డి సునిత, పి.ఈ.టి అమృత, ఇందిరా, సాదాన, షర్మిల బేగం,దేవి ప్రసాద్ తదితర ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ముందడుగు
ఆదివారం, 15-09-2024, హైదరాబాద్




## కేబీసీలో పవన్ కల్యాణ్‌పై ప్రశ్న.. కంటెస్టెంట్లు ఎంత గెలుచుకున్నారంటే?

కౌన్ బనేగా కరోడ్‌పతి.. అత్యంత ప్రజాదరణ కలిగిన షో. దీనికి బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 16వ సీజన్ కొనసాగుతున్నది. ఇందులో ప్రతి ప్రశ్నకు అమౌంట్ పెరుగుతూ పోతుంది. పాల్గొనే కంటెస్టెంట్లను బట్టి ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. ఈ క్రమంలో శుక్రవారం నాటి ఎపిసోడ్‌లో వృద్ధ దంపతులు హాట్‌సీట్‌లోకి వచ్చారు. రూ.80 వేల ప్రశ్న వరకు విజయవంతంగా సమాధానాలు చెప్పారు. అయితే అమితాబ్ అడిగిన ఆ తర్వాతి ప్రశ్న వారిని కొంత అయోమయానికి గురిచేసింది. సమాధానం తెలియక పోవడంతో వారు లైఫ్‌లైన్‌ను వినియోగించుకోవాల్సి వచ్చింది.. దాని విలువ ఎంతో తెలుసా.. అక్షరాలా లక్షా 60 వేలు. ఇంతకీ ఆ ప్రశ్న ఏంటంటే.. 2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సినీ నటుడు ఎవరు?.

దానికి పవన్ కల్యాణ్, చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ అనే ఆప్షన్లను అమితాబ్ వారికి ఇచ్చారు. అయితే, వారికి ఈ ప్రశ్నకు సమాధానం తెలియలేదు. దీంతో లైఫ్‌లైన్ వినియోగించుకుని ఆడియన్స్ పోల్‌ను ఎంపిక చేసుకున్నారు. 50 శాతానికిపైగా పవన్ కల్యాణ్ అని ఆడియన్స్ పోల్ చేశారు. దీంతో వారు కూడా అదే ఆప్షన్ లాక్ చేశారు. దీంతో రూ.1,60,000 ప్రశ్నను వారు సక్సెస్‌ఫుల్‌గా దాటేశారు.

అనంతరం ఆ కంటెస్టెంట్లకు జనసేనాని గురించి చెబుతూ.. పవన్ కళ్యాణ్ అద్భుతమైన నటుడు. చిరంజీవి ఉన్నారు కదా.. ఆయనకు ఇతను చిన్న తమ్ముడు అవుతాడు అంటూ అమితాబ్ ఇంట్రడక్షన్ ఇచ్చాడు. జనసేన పార్టీ పెట్టాడు.. ఈ ఎన్నికల్లో గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారంటూ వివరించాడు. కేబీసీలో పవన్ కల్యాణ్‌పై వచ్చిన ప్రశ్నకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. అభిమానులు, జన సైనికులు ఈ వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. కాగా, కౌన్ బనేగా కరోడ్‌పతి ప్రతీ సోమవారం నుంచి శుక్రవారం వరకు సోనీ టీవీలో రాత్రి 9 గంటలకు ప్రసారం అవుతున్నది. సోనీ లివ్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోనూ చూడొచ్చు. ఈ 16వ సీజన్ ఈ ఏడాది ఆగస్టు 12న ప్రారంభమైంది.

## పల్లెటూరి అబ్బాయిని పెళ్లి చేసుకుంటే రూ.3.5 లక్షలు

### పెళ్లి కాకుండా ఉంటున్న గ్రామీణ అబ్బాయిలు

### పలు దేశాల్లో పథకాలు, ప్రోత్సాహకాలు



ముందడుగు ప్రత్యేకం:

ప్రపంచంలోని పలు దేశాల్లో నగరీకరణ అత్యంత వేగంగా పెరుగుతోంది. గ్రామాల నుంచి చాలా మంది పట్టణాలకు వలసపోయి ఏదో ఒక ఉపాధి చూసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నారు. అమ్మాయిలు పెళ్లి వయస్సు వచ్చేసరికి పట్నం అబ్బాయిలు అంటేనే ఆసక్తి చూపుతున్నారు. దీంతో గ్రామాల్లో నివసించే అబ్బాయిలకు ఏళ్లు గడిచిన పెళ్లిళ్లు కావడం లేదు.

### వివాహాలను ప్రోత్సాహించేలా

గ్రామాల్లో నివసించే అబ్బాయిల విషయానికి వస్తే.. వారికి పెళ్లి చేసుకోవడానికి ఎక్కువ మంది అమ్మాయిలు ముందుకు రావడం లేదనేది తరుచుగా వింటూనే ఉంటాం. ఇది మన దేశంలోనే కాదు.. ప్రపంచంలోని చాలా దేశాల్లో ఇలాగే ఉంది. అయితే క్షీణిస్తున్న గ్రామీణ జనాభాను పరిష్కరించడానికి, వివాహాలను ప్రోత్సహించే ప్రయత్నంలో జపాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జపాన్ మహిళలు గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 600,000 యెన్‌లను (సుమారు రూ. 3.52 లక్షలు) అందించే ప్రభుత్వ పథకాన్ని ప్రవేశపెట్టింది.

### పథకంపై వెనక్కి తగ్గిన జపాన్

టోక్యోలోని 23 సిటీ కౌన్సిల్‌ల నుండి మహిళలు తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలకు మకాం మార్చేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జపాన్ ప్రభుత్వం ఈ స్కీమ్‌ను తీసుకొచ్చింది. తద్వారా పట్టణ ప్రాంతాలకు వలసలను తగ్గించి.. అనేక గ్రామీణ ప్రాంతాల్లో జనాభాను పెంచడం, గ్రామీణ సమాజాలను పునరుజ్జీవింపజేయ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. లింగ సమానత్వం, మహిళల స్వయంప్రతిపత్తికి ఇది విఘాతం కలిగిస్తుందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. చాలా మంది మహిళలు కూడా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఈ క్రమంలోనే జపాన్ ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ఉపసంహరించుకుంది.

### వివాహాలకు చైనా ప్రోత్సాహకాలు

ఈ విధానం జపాన్‌లో కొత్తగా తీసుకొచ్చిందేమి కాదు. ఉదాహరణకు ఈ మార్చిలో చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్.. వివాహం, ప్రసవానికి ద్రవ్య ప్రోత్సాహకాలను అందించే ఇలాంటి పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా జననాల రేటును పెంచడం, వృద్ధాప్య జనాభా సమస్యను పరిష్కరించడానికి యువ జంటలను వివాహం చేసుకునేలా, కుటుంబాలను ప్రారంభించేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే బర్త్ రేట్ తగ్గడం, వృద్ధాప్య జనాభా ఎక్కువగా ఉన్న దేశాలు/ ప్రాంతాలు.. యువత త్వరగా వివాహాలు చేసుకోవడం, కుటుంబ జీవితాలను ప్రారంభించడం కోసం ఆర్థిక ప్రోత్సహకాలు అందించే విధానాలను అవలంభిస్తున్నాయి.